క్లుప్తంగా

మానవ అక్రమ రవాణాను అరికట్టాలి

కంబాలచెరువు: జిల్లా న్యాయసేవాధికార సంస్థ, ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం మానవ అక్రమ రవాణా-వెట్టిచాకిరీ వ్యవస్థ నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాష్‌బాబు మాట్లాడుతూ అనేక మంది అక్రమ రవాణా, వెట్టిచాకిరీకి గురవుతున్నారన్నారు. ఈ బాధితులను కాపాడేందుకు వివిధ ప్రభుత్వ శాఖలు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఐజేఎం ప్రోగ్రాం పార్టనర్ ఎం.జేసుదాస్ మాట్లాడుతూ ప్రమాదకర పరిస్థితులు, హానికర ప్రదేశాలలో వీరితో బలవంతంగా పనిచేయిస్తుంటారన్నారు. వీరిని కాపాడేందుకు బృందాలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఐజేఎం సభ్యులు, రెవెన్యూ, పోలీస్, లేబర్ డిపార్ట్‌మెంట్లు, న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు, ఎన్‌జీవో సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా దీపోత్సవం



దీపోత్సవంలో పాల్గొన్న ప్రముఖులు

రాజమహేంద్రవరం సిటీ: పుష్కరఘాట్ లోని శివుని విగ్రహం సమీపంలోని సోమవారం దీపోత్సవం వైభవంగా నిర్వహించారు. మదర్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు షేక్ సుభాన్ వలీ, ఆదిరెడ్డి దివాకర్, ఆదిరెడ్డి అరుణ, రాజా శ్రీకాంత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శ్రీఘాకోళ్లపు శివరామ సుబ్రహ్మణ్యం తదితరులు హాజరయ్యారు.

ఘనంగా రెండో రాకడ పండుగ



రాకడ పండుగలో పాల్గొన్న క్రైస్తవులు

కడియం: దామిరెడ్డిపల్లి బైబిలు మిషను మహిమ మందిరంలో ఏసుక్రీస్తు రెండవ రాకడ పండుగను దేవరపల్లి రత్నరాజు ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. విశాఖపట్నం జోనల్ బైబిలు మిషను దైవజనులు షారోన్ కుమార్ వాఖ్య సందేశం అందించారు. ఎన్‌టీపీసీ విశ్రాంత డీజీఎం డి.ప్రానిస్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎజ్రా శాస్త్రి, ప్రిస్కిల్ల, దేవరపల్లి సరోజిని, అనిరుధ్, సంపర రాణి పాల్గొన్నారు.

నిర్మాణ పనులు ప్రారంభం

కంబాలచెరువు: జాంపేట లూథరన్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో ప్రహరీ, గేటు పునర్నిర్మాణ పనులను ఏఈఎల్ చర్చ్ మోడరేటర్ బిషప్ డాక్టర్ కె.ఫ్రెడ్రిక్ పరదేశిబాబు, ఆశా కిరణ్ పరదేశి బాబు ప్రారంభించారు. ప్రైమరీ స్కూల్ గేట్‌కు ఏఈఎల్‌సీ ట్రెజరర్ కె.మోజెస్ ఆర్నాల్డ్ శ్రీకారం చుట్టారు. పరదేశి బాబు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్న కరెస్పాండెంట్, సిబ్బందిని అభినందించారు. కరెస్పాండెంట్ ఎంఏ జయ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఎస్.మేరీ పెరల్స్, స్టాఫ్ సెక్రటరీ టి.మార్టిన్ సుధాకర్, సెయింట్ పాల్స్ లూథరన్ చర్చ్ పాస్టర్ రెవరెండ్ డి.బాపనయ్య, గాలి సుబ్బరాజు, లావేటి సుదర్శన్, పుచ్చల రామకృష్ణ, సాల్మన్ జయరాజ్ పాల్గొన్నారు.

మహిళా రక్షక్ పోలీసుల ర్యాలీ

కంబాలచెరువు: స్త్రీ హింస వ్యతిరేక అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా మహిళా రక్షక్ పోలీసులు సోమవారం నగరంలో అవగాహన ర్యాలీ, ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. కోటగుమ్మం నుంచి మెయిన్ రోడ్డు మీదుగా కోటిపల్లి బస్టాండ్ వరకు ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న హింసపై అవగాహన పెంచడం, హింసకు నిరసన తెలపడం, మహిళల రక్షణకు శక్తివంతమైన చర్యలు తీసుకోవడంపై ఈ ర్యాలీ ద్వారా అవగాహన కల్పిస్తున్నామన్నారు. అందరూ మహిళలకు మద్దతు ఇస్తూ సమాజంలో మార్పులు తీసుకురావాలన్నారు. మహిళలపై హింస నివారణకు సమష్టిగా పనిచేయడం అత్యంత అవసరమన్నారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

కంబాలచెరువు: శ్యామలానగర్ చెందిన వీవీఎస్ సుబ్బలక్ష్మి సోమవారం ఏవీ అప్పారావు రోడ్డులో నడిచివెళుతుండగా బైక్‌పై వచ్చిన ఇద్దరు.. ఆమె మెడలోని బంగారు గొలుసు లాక్కుని పరారయ్యారు. దీనిపై ప్రకాశం నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్ కార్యాలయం ప్రారంభం

కడియం: మండలంలోని కడియపులంక పంచాయతీ పరిధిలో కాంగ్రెస్ కార్యాలయాన్ని పీసీసీ ఉపాధ్యక్షుడు మార్టిన్ లూథర్, జిల్లా అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి, మహిళా అధ్యక్షులు మోత శారద సోమవారం ప్రారంభించారు. రూరల్ ఇన్‌చార్జి తాడాల కొండరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నిరాశే మిగిలింది

- అన్నదాతల ఆవేదన
- తగ్గిన ఖరీఫ్ దిగుబడులు
- పెరిగిన పెట్టుబడులు



మెషీన్ ద్వారా వరికోత అనంతరం ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకుంటున్న రైతులు

కడియం: ఖరీఫ్ సీజన్‌లో వరిసాగు చేసిన రైతులకు నిరాశే మిగిలింది. దిగుబడులు గణనీయంగా తగ్గడంతో పాటు పెట్టుబడులు పెరిగిపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. వచ్చిన ఆదాయం పెట్టుబడికే సరిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా కౌలుదారులు నష్టపోయారు. రూరల్ నియోజకవర్గంలో సుమారు 10 వేల హెక్టార్లలో వరిని సాగు చేస్తున్నారు. ప్రాంతాల వారీగా ఎకరాకు 24 నుంచి 30 బస్తాల మధ్య దిగుబడులు వచ్చాయి. దీంతో పెట్టుబడులకే డబ్బులు సరిపోతాయని, ఆదాయం ఏమీ రాలేదని వాపోతున్నారు. ఈ ప్రాంతంలో దాదాపు 70 శాతం మందికి పైగా కౌలుదారులే కావడం గమనార్హం.

వాతావరణమే ముంచిందా..!

వరి సాగు ప్రారంభంలో వాతావరణం అనుకూలంగానే ఉన్నప్పటికీ చిరుపొట్ట దశలో కురిసిన భారీ వర్షాలే దిగుబడులు తగ్గడానికి కారణమని తెలుస్తోంది. పూత రాలిపోవడం, తాలు గింజలు, మానుపళ్ళు ఎక్కువగా రావడం వంటివి ప్రస్తుత పంట దిగుబడి తగ్గడానికి కారణమయ్యాయి. పంట కోత దశలో కూడా వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో రైతులు తక్కువ ధరకే ధాన్యాన్ని అమ్ముకోవాల్సి వచ్చింది. దాదాపు కోతలు ప్రారంభమైన నాటి నుంచి తుపాను, వర్షాల పేరుతో వాతావరణ హెచ్చరికలు వెలువడుతూనే ఉన్నాయి. దీనికి తోడు ఆకాశం ఎప్పుడు మబ్బులు కమ్ముకుని ఉండడంతో రైతులు అయినకాడికి ధాన్యాన్ని అమ్ముకున్నారు. ప్రభుత్వం ఎవ్వరికైనా ధాన్యం అమ్ముకోవచ్చంటూ ప్రకటించి చేతులు దులిపేసుకుంది.

భరోసా లేక..

ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్న భరోసా ఉంటే ధర కోసం రైతులు ఎదురు చూసేవారు. కానీ ఇప్పుడు కేవలం దళారుల ద్వారానే ధాన్యం కొనుగోళ్లు ఎక్కువగా జరుగుతున్నాయి. వాస్తవానికి బస్తాకు రూ.1,725 రావాల్సి ఉన్నప్పటికీ, రూ.100 నుంచి రూ.200 వరకూ తగ్గించి మధ్యవర్తులు కొనుగోలు చేస్తున్నారు. ఎప్పుడు వర్షం ముంచుకొస్తుందోనన్న భయంతో రైతులు కూడా దళారులు చెప్పిన ధరకే ధాన్యాన్ని అమ్ముతున్నారు.

పెరిగిన ఖర్చులు

కొనుగోలు ధర ఇలా తగ్గిపోగా యంత్రంతో కోత, ట్రాక్టర్లతో రవాణా తదితర ఖర్చులు మాత్రం ఈ ఏడాది బాగా పెరిగిపోయాయి. గతంలో గంటకు రూ.2600 నుంచి రూ.2800 వరకూ వరి కోత మెషీన్ అద్దెగా తీసుకునేవారు. అయితే ఈ ఏడాది రూ.2800 నుంచి రూ.3 వేలు వసూలు చేస్తున్నారు. అలాగే ట్రాక్టర్‌కు రూ.700 ఉండే అద్దె రూ.వెయ్యికి పెరిగిపోయింది.

70 శాతం కోతలు పూర్తి

నియోజకవర్గంలో దాదాపు 70 శాతం వరకు వరి కోతలు పూర్తయ్యాయని వ్యవసాయశాఖ సిబ్బంది చెబుతున్నారు. రూరల్ మండలంలో ఏడు వేల హెక్టార్లు, కడియం మండలంలో మూడువేల హెక్టార్లలో వరి సాగు చేస్తున్నారు. వీటిలో స్వర్ణ, ఎంటీయూ 1318, పీఎల్ రకాలను రైతులు సాగు చేశారు. 1318 రకం పది రోజులు రావడంతో కోతలు ఆలస్యం అవుతున్నాయి.

వచ్చే పంటపైనే ఆశలు

ప్రస్తుత సీజన్‌లో వరి దిగుబడులు తగ్గాయి. వాతావరణం, కొత్త రకాల సాగు కారణంగా 24 నుంచి 30 బస్తాల మధ్యే దిగుబడులు వస్తున్నాయి. కౌలు, పెట్టుబడులు తీసేస్తే మిగిలేదీ ఏమీ ఉండదు. వచ్చే పంట పైనే ఆశలు పెట్టుకున్నాం.
– జి.వీరభద్రం, కౌలురైతు, మురమండ

గతేడాది కంటే తక్కువే

గతేడాదితో పోల్చితే ఈసారి దిగుబడి తక్కువ వచ్చింది. మరో వైపు పెట్టుబడులు బాగా పెరిగిపోయాయి. వెంటనే సొమ్ములు చేతికందడంతో మధ్యవర్తులకు ధాన్యాన్ని అమ్మేందుకే రైతులు మొగ్గు చూపుతున్నారు. భయపెడుతున్న వాతావరణం కూడా మరో కారణం.
– కేవీఎల్ నాగభూషణం, రైతు, దుళ్ల

మజ్దూర్ యూనియన్‌ను గెలిపించాలి



ప్రచారం చేస్తున్న మజ్దూర్ యూనియన్ శ్రేణులు

రాజమహేంద్రవరం సిటీ: డిసెంబర్ 4, 5, 6 తేదీలలో జరిగే మూడవ రైల్వే కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికల్లో మజ్దూర్ యూనియన్‌ను గెలిపించాలని సౌత్ సెంట్రల్ అసిస్టెంట్ డివిజన్ సెక్రటరీ విజయ కుమార్ కోరారు. ఈ మేరకు సోమవారం రైల్వే మెమూకార్ కార్ షెడ్‌లో కార్మికులతో కలిసి ప్రచారం నిర్వహించారు. 8వ వేతన సంఘం ఏర్పాటు, కేంద్ర ప్రభుత్వం బకాయి పడిన 18 నెలల ఏరియర్స్, సేఫ్టీ క్యాడర్ అందరికీ రిస్క్ అలవెన్స్ సాధించుకోవాలంటే తమ యూనియన్ ను గెలిపించాలన్నారు. ఓపెన్ లైన్ సెక్రటరీ ఈ.శ్రీనివాసరెడ్డి, లోకో రన్నింగ్ బ్రాంచ్ సెక్రటరీ తిరుమల దేవ్, ఇంజినీరింగ్ మెకానికల్ బ్రాంచ్ సెక్రటరీ జగన్నాథరావు పాల్గొన్నారు.

అసోసియేషన్ అభివృద్ధికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

సీటీఆర్ఐ: అసోసియేషన్ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ది రాజమండ్రి మైక్ అండ్ లైటింగ్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు గుల్లిపల్లి వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక నెహ్రూ నగర్ షాదీఖానాలో సోమవారం జరిగిన అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సెక్రటరీగా పొట్నూరి వసంత కుమార్, ట్రెజరర్‌గా బెవర రామారావు, గౌరవ అధ్యక్షుడిగా బొట్ల సూర్యారావు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అసోసియేషన్‌కు భవనం ఏర్పాటు చేయాలని ఎన్నో ఏళ్లుగా ప్రయత్నం చేస్తున్నామని గుర్తు చేశారు. ప్రభుత్వం, ప్రజాప్రతినిధుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళతామని తెలిపారు. సభ్యులకు ఎలాంటి సమస్య వచ్చినా పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

కంబాలచెరువు: న్యాయవాదుల రక్షణ చట్టం చేసేవరకు తమ పోరాటం ఆగదని ఏపీ బార్ కౌన్సిల్ సభ్యులు ముప్పాళ్ల సుబ్బారావు అన్నారు. తమిళనాడులో న్యాయవాదిపై జరిగిన దాడి ఘటనను నిరసిస్తూ రాజమండ్రి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం న్యాయవాదుల విధుల బహిష్కరణ చేశారు. అనంతరం బార్ అసోసియేషన్ బయట ధర్నా నిర్వహించారు. అధ్యక్షుడు తవ్వల వీరేంద్రనాథ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముప్పాళ్ల సుబ్బారావు మాట్లాడుతూ దేశంలో న్యాయవాదులకు రక్షణ కరువైందన్నారు. తవ్వల వీరేంద్రనాథ్ మాట్లాడుతూ నిరంతరం న్యాయ పరిరక్షణ కోసం పోరాడే న్యాయవాదులకు రక్షణ చట్టం లేకపోవడం శోచనీయమన్నారు. వైస్ ప్రెసిడెంట్ నాగదేవర స్వర్ణ పాప, ట్రెజరర్ కర్ర హనుమంతరావు, జాయింట్ సెక్రటరీ ధర్నాలకోట వెంకటేశ్వరరావు, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ కాశీ శ్రీనివాసరావు, లైబ్రరీ సెక్రటరీ కొత్తపల్లి శ్రీనివాస్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు పాల్గొన్నారు.

జాతీయ కిక్ బాక్సింగ్ పోటీలకు ప్రజ్ఞ



ప్రజ్ఞను అభినందిస్తున్న హెచ్ఎం నరసింహారెడ్డి

రాజమహేంద్రవరం రూరల్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో జరిగిన బాలికల కిక్ బాక్సింగ్ పోటీల్లో జీపీఆర్ఎస్ ఉన్నత పాఠశాల విద్యార్థిని నల్లా ప్రజ్ఞ ప్రతిభ చూపి, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా సోమవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎం.నరసింహారెడ్డి మాట్లాడుతూ కృష్ణా జిల్లాలో జరిగిన అండర్ -17 బాలికల బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో ప్రజ్ఞ బంగారు పతకం సాధించి, త్వరలో జరిగే జాతీయ పోటీలకు అర్హత సాధించిందన్నారు. ఆ బాలికను పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ పితాని రాజు, వ్యాయామ ఉపాధ్యాయురాలు శ్యామలాదేవి, ఉపాధ్యాయులు అభినందించారు. పాఠశాలలో ప్రోత్సాహంతో పాటు కోచ్ శామ్యూల్ రాజు, తల్లిదండ్రులు తన విజయానికి సహాయపడ్డారని ప్రజ్ఞ తెలిపింది.

రాజ్యాంగం అత్యంత పవిత్ర గ్రంథం



బహుమతులు అందజేస్తున్న డీఈవో వాసుదేవరావు

కడియం: భారతీయులను ఏకతాటిపై నడిపించే పవిత్ర గ్రంథమే రాజ్యాంగమని జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు అన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ గ్రహీత గొల్లపల్లి సత్యనారాయణ కడియం మండలంలోని 9 ఉన్నత పాఠశాలల విద్యార్థులకు సోమవారం డిజిటల్ క్విజ్ నిర్వహించారు. పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు రామకృష్ణంరాజు దీన్ని ప్రారంభించారు. ఈ పోటీలో కడియం ఉన్నత పాఠశాల విద్యార్థులు వి.లావణ్య, ఎ.సంతోషిణి ప్రథమ, వీరవరం విద్యార్థులు సీహెచ్‌వీడీ మణికంఠ, కేవీఎల్ స్పందన ద్వితీయ, వేమగిరి విద్యార్థులు ఎ.భార్గవి, ఎస్. జ్యోతి ప్రసన్న తృతీయ స్థానాలు సాధించారు. విజేతలకు రూ.1500, రూ.1000, రూ.500 ఆర్థిక ప్రోత్సాహకంతో పాటు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. పోటీలు నిర్వహించిన జి. సత్యనారాయణను జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు అభినందించారు. ఎంఈఓ వై.నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు ఎస్.శ్రీనివాస్, పి.శ్రీవెంకట దుర్గ, సువర్ణవేణి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో మంగళవారం నగరంలోని పలు ప్రాంతాల్లో సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శ్యామూల్ తెలిపారు. నారాయణపురం, బాబా నగర్, పుంత, వాంబే కాలనీలలో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ ఉండదన్నారు.

విద్యా బోధనలో వినూత్న పద్ధతులు



తాపీ పనిలో ఉపయోగించే పనిముట్లను పరిశీలిస్తున్న విద్యార్థినులు

కంబాలచెరువు: స్థానిక నాగరాజా ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మంగారాణి బోధనలో ప్రత్యేక పద్ధతులు అవలంబిస్తున్నారు. విద్యార్థులకు మరింత వివరంగా విషయాన్ని తెలియజేస్తున్నారు. 4వ తరగతి పరిసరాల విజ్ఞానంలో వృత్తులు వారి సేవలు గురించిన పాఠం ఉంది. అందులో తాపీమేస్త్రి ఏ విధంగా ఇల్లు నిర్మిస్తారో, అందుకు ఏ పనిముట్లు వాడతారో పాఠం చెప్పారు. అదే తరగతిలో చదువుతున్న టి.మహీధర్ తండ్రి సూరిబాబు తాపీ మేస్త్రి అని గుర్తించి, ఆయనను పాఠశాలకు పిలిచి ఇంటి నిర్మాణం చేసే విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. తాపీ, టేపు, గమేళా, పార, సుత్తి, వడంబం తదితర వాటి గురించి ఆయన వివరించారు. అనంతరం సూరిబాబును సత్కరించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ కేతన్ గార్గ్



రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో పీజీఆర్ఎస్‌కు హాజరైన మండల అధికారులు

రాజమహేంద్రవరం సిటీ: నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ మీ కోసం కార్యక్రమానికి అందిన అర్జీలకు సత్వర పరిష్కారం అందించే చర్యలు చేపట్టనున్నట్లు కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. సోమవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రజల నుంచి 21 అర్జీలను స్వీకరించామన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ వినూత్న, ఎస్ఈ జి.పాండురంగారావు, సిటీ ప్లానర్ జి.కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

రూరల్‌లో పీజీఆర్ఎస్‌కు కానరాని స్పందన

రాజమహేంద్రవరం రూరల్: రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు ఎటువంటి స్పందనా రావడం లేదు. జిల్లా కలెక్టరేట్ నిర్వహిస్తున్న జిల్లా స్థాయి పీజీఆర్ఎస్ వైపే మండల ప్రజలు మొగ్గుచూపుతున్నారు. దీంతో సోమవారం మండలంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు ఒకటి, కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు రూరల్ మండలం నుంచి 18 అర్జీలు రావడం విశేషం. రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు తహసీల్దార్ పీవీవీజే సూర్యకుమార్, ఎంపీడీవో డి.శ్రీనివాసరావు, ఎంఈవో తులసీదాస్‌తో పాటు మండల స్థాయి అధికారులందరూ హాజరయ్యారు. కానీ కేవలం ఒక్క అర్జీ మాత్రమే వచ్చింది. రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే పీజీఆర్ఎస్‌కు రావడం కంటే జాతీయరహదారి పక్కన ఉన్న కలెక్టరేట్‌లో జరిగే జిల్లా స్థాయి పీజీఆర్ఎస్‌కు రావడమే మండల ప్రజలకు అనువుగా ఉంది. కాగా.. బొమ్మూరు పంచాయతీ పరిధి పాత బొమ్మూరులోని క్రైస్తవ శ్మశాన వాటిక అన్యాక్రాంతం కాకుండా చూడాలని సామాజిక కార్యకర్త దివిలి ప్రభాకరరావు రూరల్ తహసీల్దార్ కార్యాలయంలోని పీజీఆర్ఎస్ అర్జీ దాఖలు చేశారు. అలాగే హుకుంపేట గ్రామ పంచాయతీలో తాత్కాలిక సిబ్బంది నియామకం, లేఅవుట్లు, చెరువులపై అక్రమ నిర్మాణాలపై విచారణ జరిపించాలని ఆ గ్రామానికి చెందిన గిరజాల శ్రీనివాసరావు కలెక్టరేట్‌లో అర్జీ దాఖలు చేశారు.

దోష రహిత ఓటరు జాబితా రూపొందించాలి



సమీక్షలో మాట్లాడుతున్న ఓటరు జాబితా అబ్జర్వర్ నాయక్, చిత్రంలో కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం రూరల్: ఓటరు జాబితాను దోష రహితంగా రూపొందించడానికి సంబంధిత అధికారులు దృష్టి సారించాలని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ కార్యదర్శి, ఓటర్ల జాబితా అబ్జర్వర్ ఎంఎం నాయక్ అన్నారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో కలెక్టర్ పి.ప్రశాంతితో కలిసి సోమవారం సాయంత్రం ఎస్ఎస్ఆర్ 2025 ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణపై ఈఆర్‌ఓలు, నోడల్ అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా నాయక్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు ఓటర్ల జాబితా ఎంతో కీలకమన్నారు. రానున్న నెల రోజుల సమయంలో ఈ విషయంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ముఖ్యంగా డిగ్రీ కళాశాల విద్యార్థులను నూతన ఓటర్లుగా చేర్పించాలని సూచించారు. జాబితాలోని లాజికల్, డెమోగ్రాఫికల్ పొరపాట్లు ఉంటే వాటిని పూర్తిస్థాయిలో సవరించాలన్నారు. కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ జిల్లాలో 2025 ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆయా అంశాలను వివరించారు. సమావేశంలో నగరపాలకసంస్థ కమిషనర్ కేతన్ గార్గ్, జిల్లా రెవెన్యూ అధికారి టి.సీతారామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మెగా పేరెంట్స్ మీటింగ్‌కు ఏర్పాట్లు చేయాలి



ఫ్లాగ్ డే పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న మెగా పేరెంట్స్ మీటింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ప్రశాంతి విద్యాశాఖాధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన సమీక్షలో పలు అంశాలపై చర్చించారు. ప్రధానోపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేసి మెగా పేరెంట్, టీచర్ మీటింగ్ అంశాలను వివరించాలన్నారు, తల్లిదండ్రులకు వార్డు పెద్దలకు ఆహ్వాన పత్రాలను ముందుగానే పంపించాలన్నారు. పూర్తి పండుగ వాతావరణంలో అన్ని పాఠశాలలలోనూ నిర్వహించాలన్నారు. ఇప్పటి వరకు జరిగిన రెండు సెల్ఫ్ అసెస్మెంట్ మోడల్ పేపర్ 1, 2 పరీక్షల మార్కులు ఆన్‌లైన్లో నూరుశాతం నమోదు కావాలన్నారు. జిల్లా పాఠశాల విద్యాశాఖ అధికారి కె.వాసుదేవరావు, ఏడీ వెంకట్రాజు తదితరులు పాల్గొన్నారు.

ఫ్లాగ్ డే పోస్టర్ ఆవిష్కరణ

సాయుధ దళాల పతాక దినోత్సవ (ఫ్లాగ్ డే) పోస్టర్‌ను కలెక్టర్ పి.ప్రశాంతి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్న రాముడు, జిల్లా సైనిక సంక్షేమ అధికారి కెప్టెన్ డా.సత్యప్రసాద్ సోమవారం సాయంత్రం కలెక్టర్ చాంబర్‌లో ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఏటా డిసెంబర్ ఏడున సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామన్నారు. దేశ రక్షణ కోసం సాయుధ దళాలు అహర్నిశలు కృషి చేస్తాయన్నారు. వారి సంక్షేమానికి విరాళాలు అందించి దేశభక్తిని చాటాలని కోరారు. విరాళాలు అందించేవారు జిల్లా సైనిక్ సంక్షేమ కార్యాలయం వారి పేరు మీద స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, జిల్లా పరిషత్ శాఖ, కాకినాడ బ్రాంచ్‌లోని ఖాతా 62064060623 ఐఎఫ్ఎస్‌సి కోడ్ ఎస్‌బీఐఎన్ 0020974 నేరుగా జమ చేయవచ్చునని జిల్లా సైనిక సంక్షేమ అధికారి కెప్టెన్ సత్యప్రసాద్ తెలిపారు.

ట్రై సైకిల్ వితరణ

సీటీఆర్ఐ: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో దరఖాస్తు చేసిన వెంటనే విభిన్న ప్రతిభావంతురాలైన నాగులపల్లి ఆదిలక్ష్మికి ట్రై సైకిల్ అందజేసినట్టు కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌లో 45వ డివిజన్‌కు చెందిన ఆదిలక్ష్మికి రూ.8,500 విలువైన ట్రై సైకిల్ అందజేశారు.

నేడు వైద్య శిబిరం

కడియం: మండల టీడీపీ అధ్యక్షులు వెలుగుబంటి నాని ఆధ్వర్యంలో మంగళవారం వెలుగుబంటి వారి కల్యాణ మండపంలో వైద్యశిబిరం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా వివిధ వ్యాధులకు స్పెషలిస్టు వైద్యులు చికిత్స అందిస్తారు.

పోలీసు అధికారులతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ నరసింహ కిశోర్

కంబాలచెరువు: జిల్లా పోలీసు అధికారులకు అరెస్టు, దర్యాప్తులో తలెత్తుతున్న సమస్యలను అధిగమించేందుకు పోలీసు అధికారులతో పాటు ఇద్దరు అడిషనల్ పీపీలు, ఆరుగురు ఏపీపీలతో ఎస్పీ డి.నరసింహ కిశోర్ సోమవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భగా అరెస్టులు, దర్యాప్తు, చార్జ్ షీట్ దాఖలు, ట్రయల్స్‌కు సంబంధించి నిత్యం ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అడిషనల్ పీపీ రాధాకృష్ణరాజు, లక్ష్మీనాయక్, అడిషనల్ ఎస్పీ అల్లూరు వెంకట సుబ్బరాజు, ఎస్‌బీఎం మురళీకృష్ణ, ఏపీపీలు, జోనల్ డీఎస్పీలు, ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

సేఫ్ ఇండియా ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

కంబాలచెరువు: స్మార్ట్ లివింగ్ ప్రోగ్రామ్‌లో భాగంగా సీతంపేటలోని శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు సోమవారం నగరంలో సేఫ్ ఇండియా ర్యాలీ నిర్వహించారు. దీనిలో భాగంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, హెల్మెట్ ధరించాలని, మొబైల్ ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయకూడదని, సీటు బెల్ట్ ధరించాలని నినాదాలు చేశారు. ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ పి.మహేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఆ విద్యార్థులను పాఠశాల ఏజీఎం ఎంవీ సురేష్, రీజినల్ ఇన్‌చార్జి యు.ఉదయ్‌శంకర్, జోనల్ కో ఆర్డినేటర్ కిరణ్ పాండే, డీన్ సాయికిరణ్, సి ఇన్‌చార్జి కుసుమ, ఉపాధ్యాయులు అభినందించారు.